సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 6 । నవంబర్ । 2023



సోమశిలలో 29.962 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 29.962 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 16 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	-రూ.63,050
22 క్యారెట్లు ఆర్నమెంటు (గ్రా)	- రూ.5,662
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,832
నవర (8 గ్రా)	- రూ.46,656

గరిష్టం/కనిష్టం
31.9 /25.2

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 82 శాతం ఉంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసింది. సోమవారం జిల్లావ్యాప్తంగా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

98.88 శాతం పింఛన్ల పంపిణీ



నెల్లూరు రూరల్ గొల్లకందుకూరులో అనసూయమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ పూర్తయింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు పింఛన్ నగదును వలంటీర్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆదివారానికి 98.88 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేశారు. జిల్లాలో మొత్తం 3,16,617 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేయాల్సి ఉండగా, 3,13,073 మందికి పంపిణీ చేశారు. సుమారు రూ.88 కోట్ల నగదును వలంటీర్లు లబ్ధిదారులకు అందజేశారు.

ముడి పామాయిల్ దిగుమతి



పంటపాళెంలోని పామాయిల్ ఫ్యాక్టరీలు

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెం పంచాయతీలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీలకు సరఫరా చేసే నిమిత్తం అదానీ కృష్ణపట్నం పోర్టులో ముడి పామాయిల్ దిగుమతి చేపట్టారు. ఇందులో భాగంగా డాల్ఫిన్ 03 అనే నౌక ద్వారా 7.500 మెట్రిక్ టన్నుల ముడి పామాయిల్ దిగుమతి చేస్తున్నారు. పైపులైన్ ద్వారా ఈ చమురును పామాయిల్ ఫ్యాక్టరీలకు తరలిస్తారు. మరోవైపు టోయో వరల్డ్ అనే నౌక నుంచి 21.500 మెట్రిక్ టన్నుల గ్రానైట్ బండలను ఎగుమతి చేస్తున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నెల్లూరు(దర్గామిట్ట): రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. నగరంతోపాటు బుచ్చిరెడ్డిపాళెం, సంగం, ఆత్మకూరు, అనంతసాగరం, కలువాయి, మర్రిపాడు, వింజమూరు తదితర ప్రాంతాల్లో ఆదివారం చిరుజల్లులు కురవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. మెట్ట రైతులకు ఈ వర్షం కాస్తా ఊరటనిచ్చింది.

8న కందుకూరులో జగనన్నకు చెబుదాం

నెల్లూరు(దర్గామిట్ట): కందుకూరులో ఈ నెల 8న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తోందని, కందుకూరులో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం 8వ తేదీన అల్లూరులో కాకుండా కందుకూరులో జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. అల్లూరులో నిర్వహించే కార్యక్రమం వివరాలను త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

స్వామిత్వ ద్వారా భూహక్కు

నెల్లూరు(పొగతోట): స్వామిత్వ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు భూములపై హక్కు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని డీపీఓ సుస్మితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామకంఠాలపై ఇప్పటి వరకు ఎలాంటి భూ హక్కు లేనందున ప్రభుత్వం చేపట్టిన చర్యల ద్వారా లబ్ధిదారులకు మేలు జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కులను కల్పించేందుకు 2020 అక్టోబర్ 11వ తేదీ నుంచి సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రావైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ (స్వామిత్వ)ను అమలు చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 722 గ్రామ పంచాయతీల్లో సర్వే నిర్వహించాల్సి ఉందని, సర్వే సిబ్బంది డ్రోన్ల ద్వారా భూసర్వే చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 120 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారని, 79 గ్రామాల్లో సర్వే ద్వారా లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు కల్పించినట్లు తెలిపారు. 38 గ్రామాల్లో పీపీఎంలు (ప్రాపర్టీ పార్సెల్ మ్యాప్‌లు) పంపిణీ చేసినట్లు తెలిపారు. హక్కు పత్రాల ద్వారా ప్రజలు వారి ఆస్తులను పరిరక్షించుకునేందుకు, బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు, విక్రయించేందుకు, వారసులకు బదిలీ చేసుకునేందుకు అవకాశం కలిగిందని తెలిపారు.

సర్కారు ఆస్పత్రులు సరికొత్తగా..



ఇతని పేరు నాగరాజు. ఇతనిది నెల్లూరు నగరం. గత కొంతకాలంగా ఫైల్స్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే వైద్యానికి రూ.50 వేలు ఖర్చవుతుందని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో నెల్లూరులోని జీజీహెచ్‌కు వెళ్లాడు. వైద్యులు పరీక్షలు చేసి సమస్యను గుర్తించారు. తక్షణమే చికిత్స చేసేందుకు ముందుకువచ్చారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేసేందుకు నిర్ణయించారు.



ఇతని పేరు పెంచలనాయుడు. ఇతనిది పొదలకూరు. ఇటీవల ఇంట్లో కాలు జారి కింద పడ్డాడు. చెయ్యి విరగడంతో జీజీహెచ్‌కు వెళ్లాడు. అక్కడ ఆర్థో విభాగం వైద్యులు పరీక్షించి చెయ్యి విరిగిన చోట ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం అతని పరిస్థితి బాగుంది. దాదాపు పది రోజులుగా జీజీహెచ్‌లో ఉన్నాడు. డాక్టర్లు ఉచిత వైద్యసేవలు అందించడమే కాకుండా ప్రతి పూట భోజనం పెట్టారు. అలాగే ప్రభుత్వం నుంచి రూ.4,720 వరకు ఆర్థికసాయం అందింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైద్యరంగానికి పెద్దపీట వేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా నియామకాలు చేపట్టింది. అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేయడంతోపాటు మౌలిక వసతులను సైతం కల్పించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు ఆస్పత్రుల్లోని వైద్యులు రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సంఖ్య గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం.

- అందుబాటులోకి అధునాతన పరికరాలు
- యూపీహెచ్‌సీలకు అదనపు హంగులు
- గణనీయంగా పెరిగిన ఓపీ సంఖ్య
- కరోనా సమయంలోనూ మెరుగైన వైద్యసేవలు

జీజీహెచ్‌లో ఓపీ సంఖ్య ఇలా..

2019లో రోజుకు - 200 నుంచి 300 మంది మాత్రమే

2023లో రోజుకు - 1,000 నుంచి 1,800 వరకు



జీజీహెచ్‌లో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం



నెల్లూరులో అధునాతన హంగులతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వాస్పత్రుల్లో ప్రస్తుతం ఉత్తమ వైద్యసేవలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యమే పరమావధిగా సకల సౌకర్యాలతో రోగులకు సేవలందిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాస్పత్రుల వరకు అన్ని సర్కారు ఆస్పత్రుల్లో మౌలిక వసతులతోపాటు అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసింది. పూర్తిస్థాయిలో వైద్యు లు, సిబ్బందిని నియమించి నాణ్యమైన వైద్యం అందిస్తుండడంతో గత నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య రెండు రెట్లు పెరిగింది.

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు

నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతున్నాయి. ప్రభుత్వం ఆయా విభాగాల్లో అధునాతన పరికరాలను ఏర్పాటు చేయడంతో వైద్యులు అత్యుత్తమ వైద్యం అందిస్తున్నారు. 2019కు ముందు కేవలం ఒక సీటీ స్కాన్, ఒక ఎక్సరే పరికరాలు ఉండేవి. అవి కూడా సక్రమంగా పనిచేసేవి కావు. దీంతో జీజీహెచ్‌కు వచ్చిన రోగులు సీటీ స్కాన్, ఎక్సరేల కోసం బయట సెంటర్లకు వెళ్లేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన సీటీ స్కాన్, ఎక్సరే, ఎంఆర్‌ఐ పరికరాలను ఏర్పాటు చేశారు. రక్తపరీక్షల సంఖ్యను పెంచారు. ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 20 ఫ్రీజర్‌లను ప్రభుత్వం అందజేసింది. రూ.10 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణంలో ఉంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లను 175కు పెంచారు. అలాగే పిడియాట్రిక్, అనస్తీషియా, పల్మనాలజీ విభాగాల్లో పీజీ సీట్లను తీసుకొచ్చారు.

యూపీహెచ్‌సీలకు అధునాతన హంగులు

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 54 డివిజన్‌లు ఉండగా, దాదాపు 9 లక్షల మందికి పైగా జనాభా ఉన్నారు. 2019 వరకు కార్పొరేషన్ పరిధిలో కేవలం 8 ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉండేవి. వాటి నిర్వహణ తూతూమంత్రంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 13 నూతన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను (యూపీహెచ్‌సీలను)అధునాతన హంగులతో నిర్మించింది. ఒక్కో భవనానికి రూ.1.10 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించింది. ఈ ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ, మందులు గది, ల్యాబ్, ప్రత్యేక వార్డు, డెలివరీ గదిని ప్రత్యేకంగా నిర్మించింది. పాత ఆరోగ్య కేంద్రాలకు నిధులు వెచ్చించి మరమ్మతులు చేసింది. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

కరోనాలోనూ ఉత్తమ వైద్యసేవలు

కోవిడ్-19 సమయంలో జీజీహెచ్‌లోని వైద్యులు, సిబ్బంది, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో రోగులకు ఉత్తమ సేవలు అందించారు. కోవిడ్ బారిన పడిన వారికి తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వైదసేవలు అందించారు.



జీజీహెచ్‌లోని కేంద్రీయ పరీక్షల విభాగంలో ఉన్న సీటీ స్కాన్ యంత్రం

సేవ చేయడానికి ముందున్నాం



జీజీహెచ్‌కు వైద్యం కోసం వచ్చిన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందిస్తాను. హాస్పిటల్‌లో ఎన్నో క్లిష్టమైన డెలివరీలు చేశాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహాయ, సహకారాలతో పేదలకు మంచి వైద్యం అందిస్తున్నాం.

– లక్ష్మీ సునంద, జీజీహెచ్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కోఆర్డినేటర్

రోగులకు అన్ని సౌకర్యాలు

నాడు–నేడు కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది. హాస్పిటల్‌కు వచ్చే రోగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. అన్ని ఏసీలు పనిచేసేలా చర్యలు తీసుకున్నాం. 10 లిఫ్ట్‌లు పనిచేస్తున్నాయి. అధునాతన పరికరాలతో సేవలు అందిస్తున్నాం.

– సిద్ధానాయక్, జీజీహెచ్, సూపరింటెండెంట్



జీజీహెచ్‌లోని కేంద్రీయ పరీక్షల విభాగం భవనం



వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మహిళకు బీపీ పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

కూచిపూడి నాట్య మయూరాలు

వారిద్దరూ అక్కాచెల్లెళ్లు. చిన్న వయస్సు నుంచే కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది తమ ప్రదర్శనలతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. నెల్లూరులోని టెక్కేమిట్టలో ఉన్న సిద్ధేంద్రయోగి నాట్యాలయంలో శిక్షణ పొందిన ఈ అక్కాచెల్లెళ్లు నేడు కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇచ్చే స్థాయికి చేరుకున్నారు.

- చిన్న వయస్సు నుంచే రాణిస్తున్న శరణ్యారెడ్డి,పర్ణికారెడ్డి
- వెయ్యికిపైగా నృత్య ప్రదర్శనలు.. వందల కొద్దీ పురస్కారాలు



కూచిపూడి నృత్య ప్రదర్శనలో శరణ్యారెడ్డి అభినయం



అక్కాచెల్లెళ్లు శరణ్యారెడ్డి, పర్ణికారెడ్డిల నృత్య ప్రదర్శన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని దర్గామిట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్న చెన్నారెడ్డి బాలశ్రీకర్‌రెడ్డి – జ్యోత్స్నారెడ్డి దంపతుల కుమార్తెలు శరణ్యారెడ్డి, పర్ణికారెడ్డి కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది ఉత్తమ ప్రదర్శనలిస్తున్నారు. శరణ్యారెడ్డి ఫిజియోథెరపి ద్వితీయ సంవత్సరం, ఆమె సోదరి పర్ణికారెడ్డి 9వ తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వీరిరువురూ కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యం పొంది దేశవ్యాప్తంగా నృత్య ప్రదర్శనలు ఇస్తూ నెల్లూరు జిల్లాకే ఐకాన్‌గా నిలుస్తున్నారు. వీరి నృత్య ప్రదర్శనలను తిలకించిన పలువురు ప్రముఖులు ప్రశంసల జల్లులు కురిపించారంటే అతిశయోక్తికాదు. శరణ్యారెడ్డి నృత్య ప్రదర్శనను తిలకించిన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా ఆమెను అభినవ సావిత్రిగా ప్రశంసించారు.

నృత్య ప్రదర్శనలు.. అవార్డులు

- రాష్ట్రంలోని తిరుమల, శ్రీకాళహస్తి, శ్రీశైలంతో పాటు ఉత్తరప్రదేశ్, కేరళ, కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడు రాష్ట్రాలతోపాటు మధుర, అయోధ్య, షిరిడీలలో వెయ్యికు పైగా ప్రదర్శనలిచ్చి అవార్డులు, రివార్డులు పొందారు.
- శరణ్యారెడ్డి, పర్ణికారెడ్డి అందుకున్న అవార్డులు, రివార్డులకు లెక్కేలేదు. ప్రధానంగా నాట్యరత్న, నాట్యమయూరి, నాట్యశిరోమణి, నాట్యశోభిత, నాట్యహంస, నాట్యభామ, చింతా రామూర్తి పురస్కారం, తెలుగు ఉగాది పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, యువరత్న లాంటి అనేక బిరుదులతో సత్కారం అందుకున్నారు.

మొదటి స్థానంలో నిలిచి..

- అంతర్జాతీయ స్థాయిలో తానా సభల్లో ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీల్లో మొదటిస్థానం
- 2022–23 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన యూత్ ఫెస్టివల్ పోటీల్లో ఫస్ట్.
- నెల్లూరు జిల్లాస్థాయి 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో జరిగిన నృత్య ప్రదర్శనల్లోనూ అగ్రస్థానం.
- జాతీయ యువజన పోటీల్లో స్పెషల్ ఫర్‌ఫార్మెన్స్‌లో మొదటిస్థానం.

పోలీసుల అదుపులో దేవరకొండ సుధీర్ !

- రహస్య స్థావరంలో విచారణ

నెల్లూరు(క్రైమ్): కావలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనలో ప్రధాన నిందితుడు దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య స్థావరంలో విచారిస్తున్నట్లు తెలిసింది. గత నెల 26వ తేదీన కావలి మద్దూరుపాడు వద్ద సుధీర్, అతని అనుచరులు ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. ఈ ఘటనపై కావలి రూరల్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. గంటల వ్యవధిలోనే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సుధీర్‌తోపాటు మరి కొందరి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. సుధీర్ పూటకో సిమ్‌కార్డు మారుస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతుండడంతో అతనిని పట్టుకోవడం కష్టతరంగా మారింది. దీంతో పూర్తిస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిందితుడిని చెన్నైలో అదుపులోకి తీసుకుని రహస్య స్థావరానికి తరలించినట్లు సమాచారం. సుధీర్, అతని అనుచరులు తక్కువ ధరకు బంగారం పేరిట పలువురిని మోసగించిన ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గత సోమవారం స్పందన కార్యక్రమంలో ముగ్గురు బాధితులు సుధీర్ మోసాలపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో సుధీర్ మోసాలపై సైతం క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం. సుధీర్ గ్యాంగ్‌పై కఠిన చర్యలు తీసుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు విధిగా పాటించాలి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): దీపావళి పండగను పురస్కరించుకుని బాణసంచా తయారీదారులు, విక్రయదారులు విధిగా నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాములు, విక్రయ దుకాణాలకు లైసెన్సులు ఉన్నాయా? భద్రతా పరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకున్నారా? లైసెన్సులో పేర్కొన్న మోతాదులోనే బాణసంచా నిల్వలు ఉన్నాయా? పరిమితికి మించి నిల్వ చేశారా తదితరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక అందజేయాలని పోలీసు అధికారులను ఆదేశించామని తెలిపారు. తనిఖీలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అనధికార నిల్వలు, విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 112కు గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

హలో.. మేం ఏసీబీ నుంచి..

- ప్రభుత్వ అధికారులకు బెదిరింపులు
- కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.లక్షలు డిమాండ్
- అందిన కాడికి దోచేస్తున్న నిందితులు
- తాజాగా ఓ దేవస్థానం ఈఓకు బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): అడ్డదారిలో డబ్బు సంపాదించాలని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గ్యాంగ్ సినిమా తరహాలో ఏసీబీ అధికారులుగా అవతారమెత్తారు. ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి రిజిస్ట్రేషన్స్, ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసు, ఆర్టీఓ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, కమర్షియల్ ట్యాక్స్ తదితర విభాగాలకు చెందిన అధికారుల ఫోన్‌నంబర్లు సేకరించి మోసాలకు తెరలేపారు. తాను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ని, హెడ్ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్ చేసి మాటలు కలుపుతారు. మీపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారు. సెటిల్ చేసుకుంటే ఓకే.. లేదంటే రైడ్ జరుగుతుందని భయపెడతారు. కావాలంటే తమ డీఎస్పీతో మాట్లాడాలంటూ బెదిరిస్తారు. బెదిరిపోయే ఉద్యోగుల నుంచి గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా రూ.లక్షల్లో నగదు వసూలు చేస్తున్నారు. ఈ తరహా నేరాలు తరచూ జరుగుతున్నా బాధిత అధికారులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడం వెనుక వివిధ కారణాలున్నాయి. దీనిని అలుసుగా తీసుకున్న సదరు నకిలీలు పెద్ద సంఖ్యలో అధికారులను బెదిరించి మరీ నగదు వసూళ్లకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారు.

గతంలోనూ ఇదే తరహా నేరాలు

గతేడాది డిసెంబర్‌లో పోలీసుశాఖలో ఏఎస్సైగా పనిచేస్తూ నగరంలో నివాసం ఉంటున్న ఓ అధికారికి నకిలీ ఏసీబీ అధికారి ఫోన్ చేశాడు. మీరు ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారని ఫిర్యాదులు అందాయని, రైడ్ చేయకుండా ఉండాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బెదిరిపోయిన సదరు ఏఎస్సై వెంటనే సదరు నకిలీ అధికారికి అడిగినంత ముట్టజెప్పారు. ఈ విషయం తెలుసుకున్న అతని కుటుంబసభ్యులు అప్పట్లో నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే తరహాలో గుర్తుతెలియని వ్యక్తి తాను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌నంటూ గత నెల 31వ తేదీన నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డికి ఫోన్ చేశాడు. మీపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, రూ.1.50 లక్షలు ఇవ్వాలని, లేదంటే రైడ్ చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడ్డాడు. దీంతో ఈఓ ఈ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తనకు కాల్ చేసిన వ్యక్తి ఫోన్‌నంబర్ ఏసీబీలో పనిచేస్తున్న వ్యక్తిదా.. కాదా.. అని ఆరా తీశారు. ఆ నంబర్ తమది కాదని ఏసీబీ అధికారులు స్పష్టంగా వెల్లడించడంతో ఈ ఘటనపై బాధితుడు ఈ నెల 2వ తేదీ రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోన్‌నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

జిల్లాలో కొన్ని ఘటనలు

- ఏసీబీ అధికారినంటూ 2020లో ఆర్టీఓ కార్యాలయంలో పనిచేసిన ఓ ఉద్యోగికి ఫోన్‌కాల్ వచ్చింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నావని ఫిర్యాదులు అందాయని, తాను అడిగినంత డబ్బు ఇస్తే రైడ్‌లు ఉండవని చెప్పడంతో బెంబేలెత్తిన సదరు ఉద్యోగి రూ.లక్షల్లో ముట్టజెప్పాడు.
- రిజిస్ట్రేషన్ శాఖలో గతంలో ఓ ఉద్యోగికి సైతం ఇదే తరహాలో ఫోన్‌కాల్ వచ్చింది. ఏసీబీ హెడ్ ఆఫీస్ నుంచి కాల్ చేస్తున్నామని, మీపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఫిర్యాదులు అందాయని, కేసు నమోదు చేయకుండా ఉండాలంటే నగదు ఇవ్వాలని బెదిరించి రూ.లక్షలు కాజేశారు.
- తాజాగా నగరంలోని ఓ దేవస్థానం ఈఓకు ఫోన్‌కాల్ వచ్చింది. మీపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. సెటిల్ చేసుకుంటే సరే.. లేదంటే రైడ్ జరుగుతుందని బెదిరించారు. రూ.1.50 లక్షలు డిమాండ్ చేయడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఫోన్‌లో సంభాషణ ఇలా..

నకిలీ ఏసీబీ అధికారి : హలో ఏసీబీ హెడ్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం.

ఉద్యోగి : నమస్తే సార్ చెప్పండి

నకిలీ ఏసీబీ అధికారి : మీపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇప్పటికే మా సిబ్బంది మీకు సంబంధించి చాలా సమాచారం సేకరించారు. మీరు మంచి వ్యక్తి అని పలువురు చెప్పారు. మీపై కేసు పెట్టాలా.. వద్దా.. అనే ఆలోచనలో ఉన్నాం.

ఉద్యోగి : సార్ నేను చాలా మంచి వాడిని. ఎవరో గిట్టని వాళ్లు నాపై ఫిర్యాదులు చేశారు.

నకిలీ ఏసీబీ అధికారి : కానీ మా ఎంక్వైరీ రిపోర్టు అలా లేదు కదా? మనం ఒక ఒప్పందానికి వస్తే కేసులు. రైడ్‌లు లేకుండా చూస్తాను. ఏమంటారు?

ఉద్యోగి : ఓకే సార్ మీరు అడిగినంత ఇస్తాను. ఇంతటితో ఆ విషయాన్ని పక్కన పెట్టేయండి.

ఇలా నకిలీ ఏసీబీ అధికారులు ఆర్టీఓ, రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల ఉద్యోగులను బెదిరించి రూ.లక్షలు దోచేస్తున్నారు. అయితే ఈ మోసాలపై ఫిర్యాదులు చేసేందుకు బాధితుల్లో ఒకరిద్దరు మినహా ముందుకు రాకపోవడం వెనుక పరువుపోతుందన్న భయమే కారణంగా తెలుస్తోంది. ఇది మోసగాళ్లకు కలిసి వస్తోంది. దీంతో వారు యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు.

తస్మాత్ జాగ్రత్త

ఏది ఏమైనప్పటికీ ఈ తరహా మోసాలపై ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఏసీబీ అధికారులు ఫోన్ చేసి నగదు డిమాండ్ చేయరన్న విషయాన్ని ఉద్యోగులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డబ్బు కోసం బెదిరింపు చర్యలకు పాల్పడితే వారు నకిలీ అధికారులని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటారు.

ఆ గ్యాంగ్ పనేనా..?

రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా నేరాల్లో దిట్ట అనంతపురం జిల్లాకు చెందిన మోస్ట్‌వాంటెడ్ జయకృష్ణ గ్యాంగ్. జయకృష్ణ, అతని స్నేహితులు గ్యాంగ్ సినిమాతో ప్రభావితమై అడ్డదారిలో డబ్బు సంపాదించేందుకు నకిలీ ఏసీబీ అధికారుల అవతారమెత్తారు. దొడ్డిదారిన ప్రీపెయిడ్ సిమ్‌కార్డులు సంపాదించి, వాటిని వినియోగించి మోసాలకు పాల్పడుతున్నారు. 2019 నుంచి రాష్ట్రంలోని కర్నూలు, పులివెందుల, అనంతపురం, మచిలీపట్నం, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలోనూ వివిధ శాఖల అధికారులకు ఫోన్ చేసి ఏసీబీ అధికారులమంటూ బెదిరించి నగదు వసూళ్లకు పాల్పడ్డారు. పలుమార్లు అరెస్ట్ అయి జైలుకు సైతం వెళ్లారు. అయినా వారి తీరులో మార్పు రాకపోగా.. తిరిగి యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. నిందితులు నకిలీ సిమ్‌కార్డులతో అధికారులకు ఫోన్‌లు చేస్తూ లొకేషన్ తెలియకుండా జాగ్రత్తలు పడుతున్నారు. తాజా ఘటన సైతం సదరు గ్యాంగ్ పనై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న ఆటో

• ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరుకు చెందిన మనోహర్, విష్ణువర్ధన్ పని నిమిత్తం గొలగమూడి వచ్చారు. తిరిగెళ్తుండగా, సర్వేపల్లి కాలువ సమీపంలో ఆటో ఢీకొంది. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

10 నుంచి చెకుముకి పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నేతలు

గూడూరు రూరల్: విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహించనున్నామని జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 10న, మండల స్థాయిలో 30న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17న, రాష్ట్రస్థాయిలో జనవరి 27, 28న నిర్వహించనున్నారని వెల్లడించారు. జేవీవీ ప్రతినిధులు పురుషోత్తమ్‌రావు, రామ్మోహన్‌రావు, సాయికిరణ్, విజయబాబు, విష్ణు, శ్రీను, గోపీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు చేరిన సీపీఎం బస్సు యాత్ర



స్వాగతం పలుకుతున్న నేతలు

గూడూరు రూరల్: రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీని రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ కోరారు. సీపీఎం తలపెట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర గూడూరుకు ఆదివారం చేరుకుంది. స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద స్థానిక నేతలు, ఉద్యోగ సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. అక్కడే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నేతలు ఉమామహేశ్వరరావు, భాస్కరయ్య, నాగరాజు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి పంచాయతీ బత్తులపల్లిపాడు (ఆనాటికండ్రిక)లో మూడు దశాబ్దాలుగా సీపీఎంలో క్రియాశీలకంగా కొనసాగుతున్న నేతలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. సీపీఎం మండల స్థాయి నేత పలుకూరు దశరథరామిరెడ్డి, మరో 50 కుటుంబాలకు చెందిన ఆయన అనుచరులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం మంత్రి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సర్వేపల్లి నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై టీడీపీ నుంచే కాకుండా ఇతర పార్టీల వారు తమ పార్టీలో చేరుతున్నారని వివరించారు. వీరికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని తెలిపారు. రామస్వామి, రవి, పెంచలయ్య, వసంతకుమార్ తదితరులు పార్టీలో చేరారు. సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పలుకూరు పోలిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు సేవ చేయాలి



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్: భారత రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి స్ఫూర్తితో తాము పుట్టిన గ్రామాలకు ప్రతి ఒక్కరూ సేవ చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. సతీష్‌రెడ్డి స్వగ్రామమైన ఆత్మకూరు మండలం మహిమలూరులో చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో వారం పాటు నిర్వహించిన నేత్ర వైద్యశిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. స్వగ్రామానికి సతీష్‌రెడ్డి అలుపెరగకుండా చేసిన సేవలు తననెంతో ఆకర్షించాయని.. దీని స్ఫూర్తితోనే తాను ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఏడీఎఫ్)ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన వారు వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని, ఏడీఎఫ్ ద్వారా తమ వంతు సేవలను అందించేందుకు ముందుకొస్తున్నారని చెప్పారు. సతీష్‌రెడ్డి చేపట్టిన సేవా కార్యక్రమాలకు చేదోడుగా అమెరికాలో ఉంటున్న డాక్టర్ రూబీ మెహర్ నేత్ర వైద్యశిబిరానికి రూ.18 లక్షలను వెచ్చించారని, ఆమెకు కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యకమ నిర్వహణలో వెంకటేశ్వర మహిమ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు శ్రీనివాసులు, నిజమాల నరసింహులు, మద్దినేని హరీష్, రవితేజ, పద్మారెడ్డి, వల్లూరు వెంకటరమణారెడ్డి తదితరులు చేసిన సేవలను కొనియాడారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ నేత కుడుముల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9 వరకు ఓటు నమోదు చేసుకోవచ్చు



మాట్లాడుతున్న బాపిరెడ్డి

కోవూరు: నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 18 ఏళ్లు నిండిన వారు తమ ఓటును డిసెంబర్ తొమ్మిది వరకు నమోదు చేసుకోవచ్చని కోవూరు ఎన్నికల ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు ప్రత్యేక ప్రచార దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటరు రోల్‌ను ప్రచురించారని, ఏమైనా సందేహాలుంటే బీఎల్వోలను సంప్రదించాలని సూచించారు. ఒకే కుటుంబంలోని వారు వివిధ పోలింగ్ స్టేషన్లలో ఓటర్లుగా ఉంటే 8 – ఏ ద్వారా దరఖాస్తు చేసుకుంటే వీరందర్నీ ఒకే బూత్‌లో చేర్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ పద్మజ, ఎన్నికల డీటీ మధు, సీనియర్ అసిస్టెంట్ సుధ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు విశేష పూజలు



విశేషాలంకారంలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. ఉదయం పలు అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. సంతానం కోసం ఆలయంలోని రావి చెట్టు, త్రిశూలం వద్ద వరపడ్డారు. ఊయల కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ట్రస్ట్ చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

రౌడీయిజాన్ని ఉపేక్షించేదిలేదు



మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రశాంతంగా ఉండే కావలిలో రౌడీలను ప్రోత్సహిస్తున్న పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలిలో రౌడీమూకల తాట తీస్తామని.. రౌడీయిజం, బెదిరింపులు, ఆక్రమణలు తదితర అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. ఇలాంటి వారిపై చర్యలు చేపట్టే పనిలో పోలీసులు నిమగ్నమై ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుక మాఫియా సృష్టికర్తలు టీడీపీకి చెందిన బీద రవిచంద్ర, మాలేపాటి సుబ్బానాయుడు అని ఆరోపించారు. కావలి చెరువు, దగదర్తి మండలం కొరుగుంటలో టీడీపీ నేతలు సాగించిన గ్రావెల్ దందాతో చెరువుల్లో గుంతలు ఏర్పడి పిల్లలు చనిపోయారని చెప్పారు. అల్లూరు మండలం నార్త్ ఆములూరులో కొన్ని వందలకెరాల్లో గ్రావెల్‌ను అక్రమంగా తరలించారని చెప్పారు. రామాయపట్నం పోర్టు, దగదర్తి విమానాశ్రయం, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన చంద్రబాబు, వాటిని విస్మరించారని ఆరోపించారు. ప్రస్తుతం వీటి నిర్మాణ పనులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శరవేగంగా చేయిస్తున్నారని తెలిపారు. జగనన్న కాలనీలు, బ్రిడ్జిల నిర్మాణాలు, కావలి – దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణ పనులు, తదితరాలకు గ్రావెల్ అవసరమని వివరించారు. అభివృద్ధి పనులకు గ్రావెల్‌ను తరలిస్తుంటే, టీడీపీ నేతలు, కొన్ని ప్రజాసంఘాలు తమపై విషప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కావలి – తుమ్మలపెంట రోడ్డులో గుంతలను పూడ్చే పనులను తానే చేయిస్తానని పేర్కొన్నారు. కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కామరాజు, జంపాని రాఘవులు, పొనుగోటి అనూరాధ, మండలి కృష్ణారావు, డేగా రాముయాదవ్, గుడ్లూరు మాల్యాద్రి, గంగనగారి శ్రీనివాసులు, తిరువీధి ప్రసాద్, పరుసు మాల్యాద్రి, మురళి తదితరులు పాల్గొన్నారు.

చందన, సీఎమ్మార్ వీక్లీ డ్రా విజేత ముమీద్

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని చందన, సీఎమ్మార్ షాపింగ్ మాల్‌లో దసరా, దీపావళి వైభవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఐదో వీక్లీ డ్రాను నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ఆదివారం తీశారు. ఐదో వీక్లీ డ్రా బహుమతి హీరో బైక్‌ను నెల్లూరుకు చెందిన ముమీద్ (కూపన్ నంబర్ 38429) గెలుచుకున్నారని ప్రకటించారు. అనంతరం గత వారం వీక్లీ డ్రా విజేతకు బైక్ తాళాన్ని అందజేశారు. డైలీ విజేతలు 35 మందికి గృహోపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ డీఎస్పీ మాట్లాడారు. మూడు దశాబ్దాల క్రితం నెల్లూరులో ప్రారంభించిన చందన బ్రదర్స్ అందరి మన్ననలు పొందిందన్నారు. పండగల సందర్భంగా లక్కీ డ్రాలు తీసి కొనుగోలుదారులకు బహుమతులను అందజేయడాన్ని అభినందించారు. కార్యక్రమంలో సీఎమ్మార్ అధినేత మావూరి శ్రీనివాసరావు, మేనేజర్లు వాసు, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.



గత వారం విజేతకు బైక్ కీని అందజేస్తున్న రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

ఉత్సాహంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు





హోరాహోరీగా పోటీలు

ఆత్మకూరు: రాష్ట్ర స్థాయి 67వ ఎస్జీఎఫ్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన అండర్ – 14, 17, 19 బాలికలకు పోటీలను నిర్వహించారు. క్వార్టర్ ఫైనల్స్‌కు కొన్ని జిల్లాల జట్లు చేరాయి. ఫైనల్స్‌ను సోమవారం నిర్వహించనున్నామని పీడీ తిరుపతయ్య తెలిపారు.

విజేతల వివరాలు..

- అండర్ 14 విభాగంలో గుంటూరు జిల్లా జట్టుపై తూర్పుగోదావరి జట్టు 35 – 33 తేడాతో విజయం సాధించింది. కడపపై కృష్ణా జట్టు 35 – 23 పాయింట్ల తేడాతో విజయకేతనాన్ని ఎగురవేసి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.
- నెల్లూరుపై విశాఖపట్నం, అనంతపురంపై శ్రీకాకుళం జట్లు విజయం సాధించాయి.
- అండర్ – 17 విభాగంలో కడపపై పశ్చిమగోదావరి జట్టు 35 – 15 తేడాతో, నెల్లూరుపై అనంతపురం జిల్లా జట్టు 35 – 20 తేడాతో విజయం సాధించాయి.
- చిత్తూరుపై గుంటూరు జట్టు 35 – 25, కృష్ణాపై శ్రీకాకుళం జట్టు 35 – 21 పాయింట్ల తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి.
- అండర్ – 19 విభాగంలో నెల్లూరుపై విశాఖపట్నం జట్టు 35 – 12, అనంతపురంపై ప్రకాశం జిల్లా జట్టు 35 – 17, గుంటూరుపై శ్రీకాకుళం జిల్లా జట్టు 35 – 22, కడపపై కృష్ణా జిల్లా జట్టు 35 – 09 పాయింట్ల తేడాతో గెలుపొందాయి.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.112
లేయర్ (లైవ్)	: రూ.113
బ్రాయిలర్ చికెన్	: రూ.200
స్కిన్‌లెస్ చికెన్	: రూ.220
లేయర్ చికెన్	: రూ.192

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.6

ఎన్‌సీసీ శిక్షణ.. భవిష్యత్తుకు నిచ్చెన

దేశసేవ చేయాలనే ఆలోచనకు నాంది

- ప్రధాన పాత్ర పోషిస్తున్న ఆర్మీ, నేవీ యూనిట్లు
- ఉన్నత విద్య, ఉద్యోగాలకు ఉపయోగపడుతున్న సర్టిఫికెట్లు
- జిల్లాలో ఆరు వేల మందికిపైగా విద్యార్థులకు శిక్షణ



స్వచ్ఛత - హీ - సేవలో ఎన్‌సీసీ విద్యార్థులు (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎన్‌సీసీలో శిక్షణ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతోంది. దేశ సేవ చేయాలనే ఆలోచన ఉండి.. ఇక్కడ శిక్షణ పొందితే సర్టిఫికెట్‌ను అందిస్తున్నారు. ఇవి ఉన్నత విద్య, ఉద్యోగాలను సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

జిల్లాలో మూడు ఎన్‌సీసీ యూనిట్లు

జిల్లాలో మూడు ఎన్‌సీసీ యూనిట్ల ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో శిక్షణను నిర్వహిస్తున్నారు. కొండాయపాళెంలోని స్నేహనగర్‌లో 24 ఆంధ్రా బెటాలియన్, 10 ఆంధ్రా నావల్ యూనిట్లు.. పొదలకూరు రోడ్డులో 2 ఏ ఈఎంఈ యూనిట్ పనిచేస్తోంది. వీటి ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఆరు వేల మందికిపైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. పలు సామాజిక కార్యక్రమాల్లోనూ వీరిని భాగస్వాములను చేస్తున్నారు.

రెండు స్థాయిల్లో శిక్షణ

➡ పాఠశాల స్థాయిలో 8, 9వ తరగతుల విద్యార్థులను జూనియర్ స్థాయిగా పరిగణిస్తారు. వీరు రెండేళ్ల పాటు ఎన్‌సీసీలో శిక్షణ పొందుతారు. అనంతరం డ్రిల్, రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైతే ఏ సర్టిఫికెట్‌ను అందిస్తారు.

➡ ఇంటర్, డిగ్రీ విద్యార్థులను సీనియర్ స్థాయిగా పరిగణిస్తారు. రెండేళ్ల పాటు నిర్వహించే శిక్షణ కాలంలో డ్రిల్, ఫైరింగ్, జనరల్ నాలెడ్జి అంశాలపై తర్ఫీదు ఉంటుంది. అనంతరం డ్రిల్, ఫైరింగ్, లిఖిత పరీక్షలను నిర్వహించి, ఉత్తర్ణులైన వారికి బీ, సీ సర్టిఫికెట్లను అందజేస్తారు.

ఇవీ ఉపయోగాలు..

➡ ఎన్‌సీసీలో శిక్షణ అనంతరం అందించే ఏ, బీ, సీ సర్టిఫికెట్లు విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఎంసెట్, ఈసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే కౌన్సెలింగ్‌లో ఎన్‌సీసీ సర్టిఫికెట్లు కలిగిన వారిని ప్రత్యేక కేటగిరీగా పరిగణించి సీట్లు కేటాయిస్తారు.

➡ సీ సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆర్మీలో అవకాశం కల్పిస్తారు.

➡ ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్లు కలిగిన వారికి పోలీస్ నియామక పరీక్షల్లో అదనంగా మార్కులు కేటాయిస్తారు.

➡ వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, నిఘా, భద్రత, సెక్యూరిటీ ఉద్యోగాల్లో వీరికి ప్రాధాన్యం లభిస్తుంది.



ఫైరింగ్‌లో శిక్షణ పొందుతూ..

దేశసేవ చేయడమే లక్ష్యం



ఎన్‌సీసీలో చేరడం ద్వారా దేశ సేవ చేయాలనే ఆలోచన మొదలైంది. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయడమే లక్ష్యం.

– రోషిణి, తొమ్మిదో తరగతి, జీవీకే చిన్మయ విద్యాలయ

కమాండింగ్ అధికారినవుతా



దేశ రక్షణ కోసం లక్షలాది మంది సైనికులు నిద్రాహారాలు మాని పనిచేస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ఆర్మీలో కమాండింగ్ అధికారినవుతా.

– సాయిచక్రేష్, జీవీకే చిన్మయ విద్యాలయ

మనోధైర్యం కలిగింది



ఎన్‌సీసీలో చేరాలంటే మొదట్లో భయమేసింది. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారయ్యేలా శిక్షణను ఇస్తున్నారు. శిక్షణ పొందుతుండటం చాలా ఆనందంగా ఉంది.

– వర్షితారామ్, స్పేస్ సెంట్రల్ స్కూల్, శ్రీహరికోట

ఆర్మీలో డాక్టర్ కావాలనేదే లక్ష్యం



ఇండియన్ ఆర్మీలో డాక్టర్‌గా చేరాలనేదే లక్ష్యం. డాక్టర్ అవ్వడం ద్వారా సైనికులకు సేవలను అందించొచ్చు.

– భువనేశ్వరి, ఏపీ మోడల్ స్కూల్, వెంకటగిరి